సాక్షి
నిజామాబాద్

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



నిండుకుండలా శ్రీరాంసాగర్

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ఇన్‌ఫ్లో తగ్గడంతో అధికారులు వరదగేట్లను మూసివేశారు.

- 8లో ▸



ధనార్జనే ధ్యేయంగా..

అత్యాశతో కొందరు ఉద్యోగులు అడ్డదారులు తొక్కుతున్నారు. అక్రమ దందాలు, బిజినెస్‌లు చేస్తూ కటకటాల పాలవుతున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.1 /22.3

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో ప్రజాపాలన దినోత్సవానికి 'ఈరవత్రి'

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 17న జిల్లాలో జాతీయ జెండాను రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఎగురవేయనున్నారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు నిర్వాహకులను నియమించగా జిల్లాకు అనిల్‌ను నియమించారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



డొంకేశ్వర్(ఆర్మూర్): అడవులను సంరక్షించడానికి ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ ఉద్యోగుల త్యాగాలు మరువలేనివని నిజామాబాద్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ సుధాకర్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అమరవీరుల చిత్రాపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ర్యాలీ నిర్వహించి ఉద్యోగులు రక్తదానం చేశారు. ఎఫ్‌డీవో మాట్లాడుతూ... అటవీ శాఖ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. పోడు చట్టాలను అమలు చేస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ ఉద్యోగులకు అటవీ సంపదను రక్షించడం కష్టంగా మారిందన్నారు. జిల్లాలో కొంతమంది ఉద్యోగులు తమ ప్రాణాలను పణంగా పెట్టి అడవులను సంరక్షించారని గుర్తు చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు సంజయ్‌గౌడ్, రవిమోహన్ భట్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ నుంచి అరుణాచలంకు బస్సు

బోధన్: పౌర్ణమి సందర్భంగా బోధన్ నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న మధ్యాహ్నం 3 గంటలకు బోధన్ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని, మార్గ మధ్యలో కాణిపాకం, వెల్లూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని మరుసటి రోజు అరుణాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. 18న అరుణాచలం నుంచి బయలుదేరి జోగులాంబ అమ్మవారి దర్శనం చేయించుకుని 19న బోధన్‌కు చేరుకుంటుందని వివరించారు. ఈ యాత్ర కోసం పెద్దలకు రూ.4,400, పిల్లలకు 3,600 టిక్కెట్ ధర చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సర్వీస్ నంబర్ 96660తో ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని, వివరాలకు 9951196134, 9985602789, 7382840367 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డాగ్ గోల్డీకి నివాళి



ఖలీల్‌వాడి: డాగ్ గోల్డీ (మందుపాతరలు గుర్తు పట్టే శునకం) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందగా అదనపు డీసీపీ(అడ్మిన్) బి కోటేశ్వర్‌రావు నివాళులు అర్పించారు. పోలీస్ బ్యాండ్‌తో అంత్యక్రియలు నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. గోల్డీ 2016 బ్యాచ్ నుంచి విధులు నిర్వహిస్తుందని, రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి, ఇవాంక ట్రంప్ పర్యటనల్లో పనిచేసిందని గుర్తు చేశారు. అనేక పతకాలు, ప్రశంసా పత్రాలు పొందిందన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వు ఏసీపీలు నాగయ్య, అరుణ్ కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్ సతీష్(అడ్మిన్), తిరుపతి(ఎమ్‌టీవో), శ్రీనివాస్(వెల్ఫేర్), జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ హన్మంత్ రెడ్డి, డాగ్ స్క్వాడ్ సిబ్బంది మనోహర్, సాయన్న, జగదీష్, మోహన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం ఎగువ ప్రాంతాల నుంచి 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో సాయంత్రం ఒక గేటు ఎత్తి 5 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు ఒక వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో నిండుకుండలా ఉంది.

ఏక దంతం.. అనేక రూపం

బోర్గాంలో 'జై జవాన్ - జై కిసాన్' గణనాథుడు



ఆర్మూర్‌లో నర్సింహస్వామి రూపంలో..



జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మండపాల్లో కొలువుదీరిన గణనాథుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. పలు ప్రాంతాల్లో విభిన్న రూపాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



నగరంలోని కుమార్‌గల్లీలో ఏర్పాటు చేసిన వినాయకుడిపై సాగరమథన దృశ్యం

జీజీహెచ్‌కు రూ.10 కోట్ల నష్టం

- రిజెక్టు అయిన ఆరోగ్య శ్రీ బిల్లులు
- డాటా ఎంట్రీ లోపాలే కారణం
- పట్టించుకోని అధికారులు

వేల్పూర్ మండలం మోతే గ్రామానికి చెందిన ఎంతినోళ్ల జీరన్న గత మే 20న అనారోగ్యంతో జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. ఆరోగ్య శ్రీ కింద వైద్యులు చికిత్స అందించారు. చికిత్స అనంతరం జీరన్న డిశ్చార్జి అయ్యారు. ఆరోగ్య శ్రీ ట్రస్ట్‌కు రూ. 80 వేల బిల్లు క్లెయిమ్ కోసం ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ ఆపరేటర్ దరఖాస్తు చేశారు. అయితే కేస్ షీట్‌ను అప్‌లోడ్ చేయకపోవడంతో బిల్లు రిజెక్ట్ అయ్యింది. ఇలా ఎన్నో కేసుల్లో సరైన పత్రాలు సమర్పించకపోవడంతో జీజీహెచ్‌కు రూ. కోట్లలో నష్టం జరిగింది. ఇటు ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు అందించిన వైద్యులకు, నర్సింగ్, ఇతర సిబ్బందికి కమీషన్ రాకుండా పోయింది.

నిజామాబాద్ నాగారం: కేవలం డాటా ఎంట్రీలో నిర్లక్ష్యం కారణంగా జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రికి ఆరోగ్య శ్రీ సేవలకు గాను రావలిసిన రూ.10 కోట్లపైకు పైగా బిల్లులు నిలిచిపోయాయి. జీజీహెచ్‌లో శస్త్ర చికిత్సలు, వివిధ వ్యాధులకు సంబంధించి ఆరోగ్య శ్రీ ద్వారానే సేవలు అందిస్తున్నారు. జీజీహెచ్ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిగా మారకముందు జిల్లా ఆస్పత్రిగా ఉన్నప్పటి నుంచే 2007 నుంచి ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా 2008 నుంచి ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స పొందిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఆరోగ్య శ్రీ ట్రస్ట్ అధికారులు వివిధ దశల్లో కేసులను పరిశీలించి అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే మూడు నెలలలోపే నిధులు మంజూరు చేస్తారు. అయితే 2008 నుంచి 2024 సెప్టెంబర్ వరకు



సుమారు 4,740 కేసులను ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ఈవో రిజెక్ట్ చేశారు. సరైన పత్రాలు పెట్టకపోవడంతో సుమారుగా రూ. 6 కోట్ల వరకు జీజీహెచ్‌కు నష్టం జరిగింది. అదేవిధంగా ఆరోగ్య శ్రీకి సంబంధించిన వైద్యులు రిజెక్టు చేసిన కేసుల్లో రూ.4,27,92,792 నష్టం జరిగింది. మొత్తంగా జీజీహెచ్‌కు ఆరోగ్య శ్రీ నుంచి రావాల్సిన రూ.10 కోట్లకు పైగా బిల్లులు రిజెక్టు అయ్యాయి.

పర్యవేక్షణ లేదు..

ఆరోగ్య శ్రీ ట్రస్ట్ కింద జీజీహెచ్‌లో తాత్కాలిక ఉద్యోగి పర్యవేక్షణలో మొత్తం 8 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తారు. వీరికి ఒక్కో ఎంట్రీకి కమీషన్ రూ.400 చొప్పున చెల్లిస్తారు. ఇటీవల జీజీహెచ్‌కు ఆరోగ్య శ్రీ బిల్లు మంజూరు కావడంతో సదరు తాత్కాలిక ఉద్యోగి పేరిట సుమారు రూ.30 లక్షల వరకు వచ్చాయి. దీంతో ఉద్యోగులు, వైద్యులు కంగుతిన్నారు. నిబంధనల ప్రకారం 8 మంది ఆపరేటర్లకు కేసుకు వచ్చే కమీషన్ రూ.400 నుంచే ఇవ్వాలి. ఇందుకు విరుద్ధంగా ఆపరేటర్లకు జీజీహెచ్ నుంచి జీతాలు చెల్లిస్తున్నారు.

వైద్యులు రిజెక్టు చేసిన బిల్లులు

బిల్లులు	కేసులు	జీజీహెచ్‌కు రావల్సిన నిధులు (రూ.లలో)
క్యాన్సిల్డ్ ట్రస్ట్ (డిశ్చార్జ్ అప్‌డేట్)	389	79,17,907
క్యాన్సిల్డ్ ట్రస్ట్ (సర్జరీ అప్‌డేట్)	1,138	2,89,85,772
క్లెయిమ్ డాక్టర్ రిజెక్టు	79	19,92,596
క్లెయిమ్ డాక్టర్ రెండోసారి పెండింగ్ మెడికోనాట్ అప్‌డేటెడ్	84	24,90,577
క్లెయిమ్ హబ్‌డాక్టర్ పెండింగ్ మెడికోనాట్ అప్‌డేటెడ్	38	5,37,700
ఈవో పెండింగ్ మెడికో నాట్ అప్‌డేటెడ్	31	8,68,240
మొత్తం	1,759	42,792,792

నేను ఇన్‌చార్జిని మాత్రమే.. నాకేం తెలియదు

జీజీహెచ్‌లో ఆరోగ్య శ్రీ సేవలు, జరుగుతున్న నష్టం గురించి నాకేం తెలియదు. నేను ఇన్‌చార్జి ఏడీగా కొనసాగుతున్నాను. ఇదివరకే ఆరోగ్య శ్రీ డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను వివరాలు అడిగినా ఇవ్వలేదు. నేను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాను. – రాజేందర్, ఏడీ జీజీహెచ్

బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఎస్ఆర్ – 2025లో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి యాప్ ద్వారా కుటుంబ సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారణ చేస్తారన్నారు. ఇంటింటి సర్వేకు తోడ్పాటును అందిస్తూ ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అవసరం ఉన్న చోట పోలింగ్ కేంద్రాలను విభజించడం, కొత్త వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. అక్టోబర్ 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ ప్రచురిస్తామని, దానిలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల పేర్లను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఈ ప్రక్రియ కోసం రాజకీయ పార్టీలన్నీ బూత్‌ల వారీగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రాఫ్ట్ రోల్‌లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు ఓటరుగా నమోదు చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు చూడాలని కోరారు. సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల డిప్యూటీ తహసీల్దార్ల నుంచి పదోన్నతి పొందిన వారికి కూడా మండలాలను కేటాయించారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సిహెచ్ కృష్ణ	పదోన్నతి	ముప్కాల్
వెంకటరమణ	డొంకేశ్వర్	నవీపేట
పి వెంకటేశ్	పదోన్నతి	సబ్‌కలెక్టర్ ఆఫీస్, బోధన్
హైమద్ హుసేన్	పదోన్నతి	డొంకేశ్వర్
ఎం రమేశ్	సాలూర	ఆలూరు
తారాబాయి	పదోన్నతి	రుద్రూరు
ఎస్ వెంకటేశం	రుద్రూర్	సివిల్ సప్లయ్ ఆఫీస్, నిజామాబాద్
బి విజయ	పదోన్నతి	మెప్మా నిజామాబాద్

వెంబడించి.. అపహరించి..

- దంపతుల నుంచి రూ. 1.96 లక్షలను లాక్కెళ్లిన దుండగుడు

నవీపేట : మాటువేసి మహిళ చేతిలో నుంచి బ్యాంకు నుంచి డ్రా చేసిన డబ్బుల కవర్‌ను లాక్కెళ్లాడో దుండగుడు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం అల్వాపూర్ గ్రామానికి చెందిన దెబ్బచిన్న చిన్నయ్య తన భార్య గంగామణితో కలిసి బుధవారం జన్నెపల్లిలోని కెనరా బ్యాంక్‌కు వచ్చారు. చిన్నయ్య తన ఖాతాలోని రూ. 1,96,000 డ్రా చేసుకుని తన భార్య చేతిలో ఉన్న కవర్‌లో పెట్టి ఆధార్‌కార్డు, ఖాతా బుక్కులను ఆమెకు అప్పగించాడు. కవర్‌లో భద్రంగా దాచుకున్న ఆమె తన భర్త తో కలిసి బైక్‌పై కూర్చొని ఇంటికి వెళ్లేందుకు బయలుదేరారు. ఇదంతా మాటువేసి గమనించిన గుర్తు తెలియని దుండగుడు బ్యాంక్ నుంచి కొద్ది దూరం వరకు దంపతుల బైక్‌ను స్కూటీపై వెంబడించారు. అదును చూసుకుని మహిళ చేతినుంచి కవర్ లాక్కుని పారిపోయాడు. ఈ పెనుగులాటలో గంగామణి కిందపడగా స్వల్పగాయాలయ్యాయి. హెల్మెట్ ధరించి స్కూటీపై వచ్చిన దుండగుడిని వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై వినయ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్యాంక్‌తో పాటు పరిసర ప్రాంతాలలోని సీసీ పుటేజీలను సేకరించారు.



విషణ్ణవదనంలో దంపతులు

ఎస్జీటీలపై ఎన్నాళ్లీ వివక్ష!

- సమస్యలను పట్టించుకునే వారు కరువు
- సంఘాల్లో సభ్యత్వానికే పరిమితం
- ప్రధాన సంఘంపై మండిపడుతున్న టీచర్లు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం డిమాండ్



నిజామాబాద్‌అర్బన్: ఉద్యోగోన్నతులు, వేతనాల్లో తమకు తీరని అన్యాయం జరుగుతోందని, ఉపాధ్యా సంఘాలకు చందాలు, సభ్యత్వానికి తప్ప తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు(ఎస్జీటీ)ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ ఉద్యోగులకు సంబంధించి వివిధ కేడర్లలో రెండేళ్లకే పదోన్నతి లభిస్తే ఎస్జీటీలకు మాత్రం 20 నుంచి 25 ఏళ్లు గడిచినా పదోన్నతి అందని ద్రాక్షగా మారింది. అలాగే ఇటీవల ఇచ్చిన పదోన్నతుల్లో జీవో నంబర్ 12 ప్రకారం న్యాయంగా రావాల్సిన పదోన్నతులు రాలేదని ఎస్జీటీలు వాపోతున్నారు. పండిత్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడేషన్‌కు అన్ని అర్హతలు ఉన్నా పదోన్నతులు ఇవ్వలేదని, అలాగే ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎం విషయంలో కొంతమంది ఎస్జీటీలకు తీవ్ర అన్యాయం జరిగిందని అంటున్నారు. ఇటీవల బదిలీ అయిన వారికి రిలీవ్ ఆర్డర్స్ రాకపోవడంతో పాతస్థానాల్లో కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అదనపు విద్యార్హతలకు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వగా, ఆ తర్వాత దానిని రద్దు చేయడంతో ఉద్యోగ కాలంలో వచ్చే నాలుగు ఇంక్రిమెంట్లను ఎస్జీటీలు కోల్పోయారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎస్జీటీలకు నెలకు రూ.125 అదనపు అలవెన్స్ ఇవ్వడం అవమానించడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పీఆర్సీలోనూ అన్యాయమే..

జిల్లాలో దాదాపు 2,800 మంది ఎస్జీటీలు ఉండగా, ప్రతి వేతన సవరణలో తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఒకే విద్యార్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు, ఎస్జీటీలకు వేతన వ్యత్యాసం పెరుగుతోంది. 2010 పీఆర్సీలో ఎస్జీటీలకు వేతనం రూ.10,900, సూల్క్ అసిస్టెంట్‌లకు రూ.14,860 ఉంది. 2015లో ఎస్జీటీలకు రూ.21,230, స్కూల్ అసిస్టెంట్‌లకు రూ.28,940, అలాగే 2020 పీఆర్సీలో ఎస్జీటీల వేతనం రూ.31,040 ఉండగా, స్కూల్ అసిస్టెంట్లకు రూ.42,300 ఉంది. త్వరలో ఇవ్వనున్న పీఆర్సీలో వివిధ ఉపాధ్యాయ సంఘాలు స్కూల్ అసిస్టెంట్ల జీతం రూ.77 వేలకు పైగా ప్రతిపాదించగా ఎస్జీటీలకు మాత్రం రూ.62,000గా ప్రతిపాదించారు. తమ సమస్యలను పరిష్కరించడంలో ఉపాధ్యాయ సంఘాలు వివక్ష చూపుతున్నాయని ఎస్జీటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన సంఘం ఎన్నికలు జరుగుతున్న తరుణంలో దూరంగా ఉండాలని ఎస్జీటీలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోవడం కారణంగానే వివక్ష కొనసాగుతోందని వారు అంటున్నారు.

న్యాయం చేయాలి



ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీల సమస్యలు పరిష్కరిస్తేనే ప్రాథమిక పాఠశాలలకు మనుగడ ఉంటుంది. అలాగే పదోన్నతుల్లో కూడా ఎస్జీటీలకు న్యాయం చేయాలి. ప్రతి పాఠశాలకు పీఎస్ హెచ్‌ఎం ఇచ్చే విధంగా ఎస్జీటీలందరికీ పదోన్నతులు ఇవ్వాలి. – వెంకటేశ్వర్‌గౌడ్, ఎస్జీటీ

ఓటు హక్కు కల్పించాలి



ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీలకు పీఎస్ హెచ్‌ఎంలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి. ఎస్జీటీల సమస్యల పరిష్కారానికి సంఘాలు చొరవ చూపాలి. త్వరలో ఇచ్చే పీఆర్సీలో ఎస్జీటీలకు న్యాయం చేయాలి. బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలి. – అంకం నరేశ్, ఎస్జీటీ

క్లుప్తంగా

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



నిజామాబాద్ నాగారం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రాజశ్రీ హెచ్చరించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లాలో అవగాహన కల్పించాలన్నారు. స్త్రీ పురుష నిష్పత్తి తక్కువ ఉన్న మండలాల్లో ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 154 స్కానింగ్ సెంటర్లు ఉంటే 125 మాత్రమే పని చేస్తున్నాయని, వీటి నిర్వాహకులు రిజిస్ట్రేషన్, రెన్యువల్ తప్పకుండా చేసుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో మహిళా సిబ్బంది, లేడీ రిసెప్షనిస్ట్ ఉండాలన్నారు. పుట్టబోయే బిడ్డ ఆడా, మగ అని చెబితే సెంటర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, డీడబ్ల్యూవో రసూల్‌బీ, గైనకాలజిస్ట్ ఇందు, పిల్లల వైద్యనిపుణులు సాధన, రేడియాలజిస్ట్ దీప్తి, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, డీహెచ్ఈ వెంకటేశ్వర్లు, దేవేందర్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన ఎస్సై

సిరికొండ: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని ఎస్సై రామ్ కాపాడి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించిన ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. ఎస్సై తెలిపిన ప్రకారం.. జగదాంబ తండాకు చెందిన బనావత్ గణేశ్ ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి గడ్డి మందు తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో బంధువులు పీఎస్‌కు వచ్చి విషయం చెప్పారు. ఎస్సై ఫోన్ లోకేషన్ ద్వారా మామిడి చెరువు అటవీ ప్రాంతంలో గణేశ్ బొడ్డు ఉన్నట్లు గుర్తించాడు. అప్పటికే విషం సేవించడంతో పోలీసు జీపులో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా ధర్పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించినట్లు తండావాసులు పేర్కొన్నారు.

ధనార్జనే ధ్యేయంగా..

కొందరు ఉద్యోగుల విధులు
- అధిక సంపాదన కోసం అడ్డదారులు
- చివరికి కటకటాల పాలవుతున్న వైనం



ఖలీల్‌వాడి: ధనార్జనే ధ్యేయంగా జిల్లాలోని కొన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు అడ్డదారులు తొక్కుతున్నారు. విధి నిర్వహణలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేయాల్సిన కొందరు అధికారులు, ఉద్యోగులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. స్వలాభాలకు అలవాటు పడి విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ఫలితంగా కొందరు సస్పెన్షన్‌కు గురికాగా మరికొందరు కటకటాల పాలవుతున్నారు. జిల్లాలో ఇలాంటి పలు ఘటనలు చోటు చేసుకున్నాయి.

- నిర్మల్ జిల్లా కేంద్రంలో 'యూ-బిట్ కాయిన్' ఆన్‌లైన్ వ్యాపారంలో అరెస్ట్ అయిన ఆర్మూర్ ఎస్సై గంగాధర్‌ను సస్పెన్షన్ చేస్తూ వరంగల్ ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ అంజన్న ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.
- జిల్లా కేంద్రంలోని నాలుగో టౌన్ పీఎస్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పోలీసులకు ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ బండి నారాయణ, తహసీల్ కార్యాలయంలో పనిచేసే ఆర్ఐ రఫీక్, పోలీస్ కానిస్టేబుల్ మూర్తి ఉన్నారు. వీరిపై కేసు నమోదు కావడంతో శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆగస్టు 13న పోలీసులు సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందించారు. ఇంత వరకు చర్యలు చేపట్టలేదు.
- నగరంలోని ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే హెడ్ కానిస్టేబుల్ చైన్ సిస్టం బిజినెస్‌ను ప్రారంభించారు. ఇందులో సభ్యులు రూ. 13 వేలు చెల్లించి మరో ముగ్గురి సభ్యులు చేర్పించాలి. ఇందులో లొసుగులు ఉన్నాయని కొందరు, సభ్యులు కాని వారు తమ డబ్బులు ఇవ్వాలంటు పలువురు సదరు హెడ్ కానిస్టేబుల్ ఇంటికి వెళ్లి హంగామా చేశారు. ఈ విషయం సంబంధిత ఉన్నతాధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు.
- నగరంలోని ఓ కానిస్టేబుల్ ఇద్దరు పొలిటికల్ లీడర్ల సహకారంతో పేకాట దందాను నిర్వహించారు. గతంలో పేకాట ఆడుతున్న సమయంలో పోలీసులు దాడులు నిర్వహించగా తప్పించుకునేందుకు బంగ్లాపై నుంచి దూకడంతో కాలు విరిగింది. ఇప్పటికీ సదరు కానిస్టేబుల్ పొలిటికల్ లీడర్లతో కలిసి పేకాట దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మత్తులో ఎక్సైజ్ శాఖ..

ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు గ్రామాల్లో తనిఖీలు చేపడుతూ దేశీదారు, గంజాయి, అల్ప్రాజోలం, నల్లబెల్లం, పట్టిక, మత్తు పదార్థాలను కట్టడి చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు అధికారులు పేకాట, ఆన్‌లైన్, యూ-బిట్ కాయిన్ వంటి వ్యాపారులు చేస్తూ జైలు పాలవుతున్నారు. డిపోల్లో తనిఖీల పేరిట ఓ అధికారి పెద్ద మొత్తంలో చేతులు తడుపుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పోలీసుల నిఘా ఎక్కడ..!

జిల్లాలో పోలీసుల నిఘా నిద్రపోవడంతో సంబంధిత పీఎస్ పరిధిల్లో పీడీఎస్ దందా, ఇసుక రవాణా, మొరం తవ్వకాలు, గంజాయి అమ్మకాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది కానిస్టేబుళ్లు అక్రమ వ్యాపారుల నుంచి నెలవారీ మాముళ్లు వసూలు చేస్తూ వాటి ద్వారా ఫైనాన్స్, చైన్ బిజినెస్, రియల్‌ఎస్టేట్ వంటి వ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో పేకాట కేంద్రాలు నిర్వహించి రూ. లక్షల్లో కూడబెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులే ఇలా పెడదారిన పట్టడంతో సరైన ప్రజాపాలన ఎలా సాగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిండుకుండలా శ్రీరాంసాగర్

- పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరిన ప్రాజెక్ట్
- ఎగువ నుంచి 28 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



పూర్తిస్థాయి నీటి మట్టంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ప్రస్తుత సంవత్సరం తొలిసారి పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ప్రాజెక్ట్‌లోకి ఈ నెల 1 నుంచి భారీగా వరదలు వచ్చాయి. దీంతో ప్రాజెక్ట్ నీటి నిల్వ 72 టీఎంసీలకు చేరుకోగానే ప్రాజెక్ట్ అధికారులు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ఎప్పుడు చేరుకోలేదు. కానీ తొలిసారిగా బుధవారం ప్రాజెక్ట్ పూర్తి నీటి నిల్వ 80.5 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ ప్రాంతా లనుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మంగళవారం రాత్రి వరద గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 28 వేల క్యూక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

వరద కాలువ ద్వారా పెరిగిన నీటి విడుదల

శ్రీరాసాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను 18 వేల క్యూసెక్కుల నుంచి 19,500 క్యూసెక్కులకు పెంచారు. కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 666 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది.

70 టీఎంసీలు గోదావరి పాలు

ప్రాజెక్ట్‌లోకి పది రోజుల వ్యవధిలో 106 టీఎంసీల వరద నీరు వచ్చి చేరితే అందులో 70 టీఎంసీల నీరు గోదావరి పాలైంది. వరద గేట్ల ద్వారా 70 టీఎంసీలు గోదావరిలోకి వదిలారు. వరద కాలువ ద్వారా 9.67 టీఎంసీలు, కాకతీయ కాలువ ద్వారా 9.93 టీఎంసీలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2.34 టీఎంసీలు, సరస్వతి కాలువ ద్వారా 0.53 టీఎంసీలు, లక్ష్మి కాలువ ద్వారా 0.11 టీఎంసీలు విడుదల చేశారు. ఆవిరి రూపంలో 3.32 టీఎంసీలు, మిషన్ భగీరథ ద్వారా 2.05 టీఎంసీలు నీరు పోయింది. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు 170.84 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

23 నుంచి డీఎస్ ప్రమోషన్ స్పోర్ట్స్ నిర్వహణ



మాట్లాడుతున్న మాజీ మేయర్ ధర్మపురి సంజయ్

ఖలీల్‌వాడి: డీఎస్ 76వ జయంతి సందర్భంగా ఈ నెల 23 నుంచి 27 వరకు డీఎస్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, పలు క్రీడా పోటీలు ఉంటాయని పాఠశాల, ఇంటర్ బాలబాలికలు మాత్రమే పాల్గొన్నాలన్నారు. ఈ పోటీలు జిల్లా క్రీడా అథారిటీ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న మార్చ్ ఫస్ట్ ఉంటుందని క్రీడాకారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జట్లకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే టీమ్‌లు ఈ నెల 15న సాయంత్రం 5లోగా సంబంధిత వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పీడీలు విద్యాసాగరరెడ్డి 9440066250, రమేశ్ 9440007004లను సంప్రదించాలన్నారు. సమావేశంలో రిటైర్డ్ అధికారి సాయిలు పాల్గొన్నారు.

నేడు గురుకులాల్లో స్పాట్ కౌన్సెలింగ్

డిచ్‌పల్లి: నిజామాబాద్ రీజనల్ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలురు, బాలికల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 12న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.2లక్షలకు మించకుండా ఉండాలన్నారు. విద్యార్థులు నిర్ణీత దరఖాస్తు ఫారంతో పాటు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, బోనాఫైడ్, గత ఏడాది చదివిన తరగతి మార్కుల మెమోతో హాజరు కావాలన్నారు.
ఆయా తరగతుల్లో ప్రవేశాల కోసం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించిన వీటీజీసెట్-2024, బీఎల్‌వీసెట్-2024కు హాజరై సీటురాని విద్యార్థులు, సీటు వచ్చినా వివిధ కారణాలతో పాఠశాలల్లో చేరని విద్యార్థులు, అనాధ విద్యార్థులకు సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందని జోనల్ ఆఫీసర్ పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులకు నిబంధనలు, మెరిట్ ప్రాతిపదికన అదేరోజు ప్రవేశాలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆలూర్ హెచ్‌ఎంను సన్మానించిన కలెక్టర్



నరేందర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

పెర్కిట్: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మేస నరేందర్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బుధవారం ఘనంగా సన్మానించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హెచ్‌ఎం నరేందర్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ గెజిటెడ్ హెచ్‌ఎంగా ఎంపిక చేస్తూ అవార్డును అందజేశారు. దీంతో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హెచ్‌ఎం నరేందర్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో అశ్ఫాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సుధాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్

రాష్ట్ర ఉత్తమ అధ్యాపడికి..

తెయూ(డిచ్‌పల్లి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న తెయూ సౌత్ క్యాంపస్(భిక్కనూర్) ప్రిన్సిపాల్ ఆర్ సుధాకర్‌గౌడ్‌ను తెయూ రిజిస్ట్రార్ యాదగిరి తెయూ పరిపాలనా భవనంలోని చాంబర్‌లో బుధవారం సన్మానించారు. ఇలాంటి అవార్డులు అధ్యాపకుల బాధ్యతలను మరింత పెంచుతాయని, వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వర్సిటీ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, చీఫ్ వార్డెన్ మహేందర్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విలాసాల కోసం చైన్ స్నాచింగ్

- నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు(ఫైల్)

మోర్తాడ్: విలాసాల కోసం అలవాటు పడిన ఓ చైన్ స్నాచర్ పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. మెండోరా మండలం దూద్‌గాంకు చెందిన చవాన్ కిరణ్‌సింగ్ కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఉదయం మాస్టర్‌గా పనిచేసేవాడు. ఇతను చేస్తున్న పనికి సంతృప్తి చెందేవాడు కాదు. విలాస జీవితం గడపాలనే ఉద్దేశంతో చైన్ స్నాచర్‌గా అవతారం మెత్తాడు. ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి వారి మెడలో నుంచి బంగారు నగలును దోచుకోవడం అలవాటుగా చేసుకున్నాడు. హోటల్‌లో మాస్టర్‌గా పని చేస్తూనే మోర్తాడ్, మెండోరా, ముప్కాల్, ఏర్గట్ల పీఎస్‌ల పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. ఏర్గట్ల ఎస్సై రాము, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితుని కదలికలపై నిఘా పెట్టారు. ఏర్గట్లలో ఇటీవల నిర్వహించిన చైన్ స్నాచింగ్ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు అనేక చోట్ల సీసీ కెమెరాలను పరిశీలించారు. చివరకు నిందితుడి కదలికలపై నిఘా పెట్టడంతో పోలీసులకు ఆ చైన్‌స్నాచర్ చవాన్ కిరణ్‌సింగ్ అని తేలింది. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపడితే మోర్తాడ్, మెండోరా, ముప్కాల్, ఏర్గట్లలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు కిరణ్‌సింగ్ ఒప్పుకున్నాడు. నాలుగు కేసులలో నిందితుడు ఎవరనేది ఏర్గట్ల పోలీసులు తేల్చడంతో పలువురు పోలీసు సిబ్బందిని అభినందిస్తున్నారు.

బార్ కార్యదర్శిపై దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో నిజామాబాద్ బార్ అసోసియేషన్ సెక్రటరీ వసంత్‌పై సస్పెన్షన్ న్యాయవాది జగన్నాథం బుధవారం దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ జగన్నాథం అనే న్యాయవాదిని సస్పెండ్ చేసింది. సదరు న్యాయవాది ఓ కేసు విషయంలో కొందరిని తీసుకుని కోర్టుకు వచ్చారు. బార్ సెక్రటరీ వసంతశ్రీ విషయాన్ని గమనించి కేసు కోసం వచ్చిన వ్యక్తులతో జగన్నాథంను బార్ అసోసియేషన్ సస్పెండ్ చేసిందని కేసులు చేసేందుకు వీలులేదని చెప్పారు. దీంతో జగన్నాథం ఆగ్రహంతో సెక్రటరీపై దాడికి పాల్పడగా ముఖంపై గాయాలయ్యాయి. ఈ విషయమై బాధితుడు వసంత్ ఒకటో టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై నిజామాబాద్ బార్ అసోసియేషన్ కమిటీ సమావేశం కానున్నట్లు తెలిసింది.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థులు



జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల సుద్దపల్లిలో బాలికలు, ఆర్మూర్‌లో బాలుర జిల్లా స్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో తొర్లికొండ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దీంతో పాఠశాలకు చెందిన బాలికల విభాగంలో బురుగు మైత్రి, గడ్డం సంధ్య, బాలుర విభాగంలో జక్కం పవన్, శివ, సృజన్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం, ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గంగామోహన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను జిల్లా కేంద్రంలోని ఆఫీసర్ క్లబ్‌లో బుధవారం నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 ఆధ్వర్యంలో బాలబాలికలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి ఎంపికలను డీఐఈవో టి రవికుమార్, కోచ్ వినయ్‌సాగర్ ఆధ్వర్యంలో చేపట్టారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. పోటీలకు ఎంపికైన వారిలో బాలుర విభాగంలో గణేశ్, కేవిన్ రొనాల్డ్, ఎండీ జహీరొద్దీన్, అద్విత్, సాత్విక్ చారి, బాలికల విభాగంలో జి స్పందన, జి శ్రీనిధి, ఎం అశ్రిత, రమాదేవి, సంజన, మానస ఉన్నారు.

బతికి సాధిద్దాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు


నిజామాబాద్‌నాగారం: జీవితంలో వచ్చిన కొద్దిపాటి కష్టానికి నిండు జీవితాన్ని ఆత్మహత్యల రూపంలో బలి చేసుకోవద్దని, ఎంతటి కష్టానైనా బతికి సాధించుకోవాలని ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ రాజు అన్నారు. నగరంలో పాత కలెక్టరేట్‌మైదానంలో ఐఎంఏ, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంత మంది యువత మానసిక అనారోగ్యంతో జీవితంలో ఏదో కోల్పోతున్నామనే క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. పిల్లల్లో మానసిక అనారోగ్య సమస్యలు ఉంటే తల్లిదండ్రులు గుర్తించి మానసిక వైద్యులను సంప్రదించి తగు సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడి, బాధల నుంచి విముక్తి పొందాలంటే ప్రతి రోజు వ్యాయామం, యోగా చేయాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు దామోదర్ రావు, ఓ శ్రీశైలం, రాజేంద్ర ప్రసాద్, మెంటల్ హెల్త్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ విశాల్ ఆకుల, జార్జి రెడ్డి, కరుణాకర్, చక్రపాణి, జీవన్ రావు, ఐఎంఏ సభ్యులు తదితరుల పాల్గొన్నారు.

14న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న నాగారంలోని రాజారామ్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ బుధవారం పేర్కొన్నారు. అండర్-14, 16, 18, 20 విభాగంలో బాలబాలికలకు 60మీటర్లు, 100, 400, 600, 800, 2000 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షార్ట్ పుట్, జావిలిన్ త్రో పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకొని రావాలన్నారు. ఈ నెల 13 సాయంత్రం 5లోపు రూ. వంద ఎంట్రీ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి మూడు స్కూళ్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లు అందజేస్తామన్నారు. ఈనెల 19, 20వ తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టుని ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9989040776 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



గాంధారి(ఎల్లారెడ్డి): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైరును సరిచేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని గుర్జాల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అమర్లబండ దేవేందర్‌రావు అలియాస్ రాజు(35) ఉదయం తన పత్తి చేనులో పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. చేనుకు నీరు పారించేందుకు బోరు మోటర్ ఆన్ చేయగా అది రాలేదు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ వైరు ఊడిపోయినట్లు గమనించి దానిని కర్రతో సరిచేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంటర్నేషనల్ హోటల్‌పై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటర్నేషనల్ హోటల్‌పై పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ హోటల్లో వ్యభిచారం చేస్తున్న 8 విటులు, 5 గురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కమ్మర్‌పల్లి మండలానికి చెందిన వారు హోటల్లో లాడ్జ్ బుక్ చేసుకున్నట్లు తెలిసింది. కొన్ని రోజుల నుంచి ఈ హోటల్లో వ్యభిచారం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు పక్కా సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలుస్తోంది.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

లింగంపేట: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. మండలంలోని ఎక్కపల్లి తండాకు చెందిన నేనావత్ సర్దార్(35) ఆగస్టు 31న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఈ నెల 3న పోలీసులకు అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. బుధవారం సూర్దకుంట వద్ద మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహం సర్దార్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి శివారులో పోలీసులు బుధవారం పేకాట స్థావరంపై దాడిచేసి పది మందిని అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, బస్వాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నేతతో పాటు మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన ఏడుగురు బడా వ్యాపారులు ఉన్నట్లు సమాచారం. రూ.13, 760 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. కాగా పేకాట రాయుళ్లు యూపీఏ ద్వారా ఆన్‌లైన్‌లో పెద్ద మొత్తంలో నగదు చెల్లింపులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు.

కొత్తపల్లిలో..

రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ బుధవారం పేర్కొన్నారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు స్థావరంపై దాడి చేయగా ముగ్గురు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ. 5520 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకుర్దు, సాలూర మండల కేంద్రంలోని శివారులో ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను చోరీ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్ కోసం ఈనెల 30 వరకు అవకాశం ఉందని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ బుధవారం పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 7382929785, 9951470246 నంబర్లను సంప్రదించాలన్నారు.

చిరుత సంచారం

నిజాంసాగర్: మండలంలోని గోర్గల్ అటవీ ప్రాంతంపై బుధవారం సాయంత్రం చిరుత వెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. చెర్వు ముందరి తండా శివారులోని నీలగిరి ప్లాంటేషన్ నుంచి గోర్గల్ గ్రామ ప్లాంటేషన్ వైపు చిరుత రోడ్డు దాటి వెళ్లిందన్నారు. చిరుత సంచారంతో ఆయా ప్రాంతాల్లో పంటపొలాల కాపాలాకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు కోరారు.

మద్యం మత్తులో తల్వార్‌తో దాడి

బాన్సువాడ/బాన్సువాడరూరల్: పట్టణంలోని మధురాలయ బార్ వద్ద బుధవారం రాత్రి ఓ యువకుడు తల్వార్‌తో దాడి చేసిన ఘటన కలకలం సృష్టించింది. సంజీవ్ అనే ఆటోడ్రైవర్ తన మిత్రుడు పల్లికొండ కృష్ణతో కలిసి బార్‌లో మద్యం తాగుతున్న సమయంలో సోనూసింగ్ అనే వ్యక్తి అక్కడికి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న వీరి మధ్య మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారు. సోనూసింగ్ ఇంటికి వెళ్లి తల్వార్ తీసుకొచ్చి సంజీవ్‌పై దాడికి పాల్పడ్డాడు. దాడిలో సంజీవ్‌కు చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని సంజీవ్‌ను వైద్యం కోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంజీవ్ తమ్ముడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ పేర్కొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగంలో బాలబాలికలకు కరాటే పోటీలను కామారెడ్డి జిల్లా దోమకొండలో శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల కార్యదర్శి నాగమణి బుధవారం పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు హాజరు కావాలన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.